విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

అగ్ని ప్రమాదంలో గల్లంతైన మృతదేహం లభ్యం

- ప్రమాద ఘటన స్థలాన్ని పరిశీలించిన మంత్రి కొట్టు, జిల్లా కలెక్టర్
- రూ. 50 లక్షల నష్టపరిహారం ప్రకటించిన ఫ్యాక్టరీ యాజమాన్యం

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం రూరల్ : ఫుడ్ ఫ్యాక్స్ ఫెర్టిలైజర్స్ కంపెనీ ఫ్యాక్టరీలో జరిగిన అగ్నిప్రమాదంలో గల్లంతైన మల్లికార్జునరావు మృతదేహం గురువారం బయటపడింది. ఫ్యాక్టరీ యాజమాన్యం చేపట్టిన సహాయక చర్యల్లో ఇనుప శిథిలాల కింద , గుర్తుపట్టలేని విధంగా మల్లికార్జునరావు మృతదేహం గుర్తించలేని విధంగా లభించింది. దీంతో కార్మికులు, యాజమాన్యం ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. అప్పటివరకు తోటి కార్మికులతో సరదాగా గడిపిన మల్లికార్జునరావు ప్రమాదంలో చిక్కుకొని విగతజీవిగా మరణించడంతో కార్మికుల్లో ఆందోళన నెలకొంది. కాలం చెల్లిన యంత్రాలను ఏకధాటిగా వినియోగించడం, ప్రమాదాలు జరిగిన సమయంలో బయటపడేందుకు సరియైన ఫైర్ పరికరాలు లేకపోవడం వల్ల కార్మికుల ప్రమాదానికి గురై మృత్యువాత పడుతున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే క్రమం సంఘటన స్థలాన్ని పరిశీలించేందుకు ఫ్యాక్టరీ చేరుకున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ జిల్లా కలెక్టర్ ప్రశాంతి కి ప్రమాదం జరిగిన తీరుపై యాజమాన్యాన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుని కుటుంబానికి పరిహారం కింద 50 లక్షల రూపాయలు, భార్యకు ఫ్యాక్టరీలో ఉద్యోగం ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించిందని కొట్టు సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో దాసిరాజు, తహసీల్దారు శేషగిరి, ఫుడ్ ఫ్యాక్స్ ఫెర్టిలైజర్ ఫ్యాక్టరీ యజమాని, కార్మికులు మృతుని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఐఎఎల్ టేబుల్ కోర్టు క్యాలండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర -భీమవరం: ఐఎఎల్ టేబుల్ కోర్టు కేలండర్ కక్షిదారులకు, అడ్వకేట్స్ కు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ఐఎఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు అన్నారు. ఎ.పి.బార్ కౌన్సిల్ సభ్యులు ముప్పాళ్ల సుబ్బారావు రూపొందించిన కోర్టు టేబుల్ కేలండర్ ను గురువారం భీమవరం జిల్లా కోర్టు ప్రాంగణంలో ఐఎఎల్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చెల్లబోయిన మాట్లాడుతూ సెలవులు, కోర్టు వాయిదాలు నోట్ చేసుకోడానికి కేలండర్ అనుకూలంగా ఉందని ప్రశంసించారు. కార్యక్రమంలో ఐఎఎల్ సభ్యులు మల్లుల శ్రీనివాసరావు, వై.వి.ఆనంద్, కామన రామకృష్ణ, కూనపరాజు రామకృష్ణంరాజు, కె.వి.సుబ్బారావు, డి.కె.వి.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

26న వాడవాడలా సీపీఐ ఆవిర్భావ వేడుకలు

విశాలాంధ్ర - కుక్కునూరు: ఈ నెల 26 వ తేదీన సిపిఐ ఆవిర్భావ దినోత్సవాన్ని కుక్కునూరు మండలంలో ఘనంగా నిర్వహిం చాలని సిపిఐ మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి పిలుపునిచ్చారు. సిపిఐ కుక్కునూరు మండల కౌన్సిల్ సమావేశం గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో సోడే నాగేష్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో మైసాక్షి వెంకటాచారి మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ 97 సంవత్సరాలు పూర్తి చేసుకుని 98వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈ నెల 26 వ తేదీన వాడవాడల పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలని తెలిపారు. పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కారం లో పాలక ప్రభుత్వాలకు చిత్తశుద్ధి కొరవడిందని, నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు సిపిఐ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించడానికి కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు. కొన్నె లక్ష్మయ్య మండల నాయకులు వర్స పాపారావు, వర్సా నాగేశ్వరరావు, సోడే రాంబాబు , నకిరికంటి నాగరాజు, మారయ్య ,కౌవులూరి భీమయ్య, సోమరాజు , తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ కేక్ కట్ చేసిన జడ్పీ చైర్మన్

విశాలాంధ్ర - పాలకొల్లు: మండల పరిషత్ సమావేశ మందిరంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కేక్ కట్ చేసి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. జెడ్పీటీసీ నడపన గోవింద రాజులు, ఎంపీపీ చిట్టూరి కనకమహాలక్ష్మి ఏడు కొండలు, ఎంపీడీవో సంగాని వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సాగ సత్యనారాయణ, గోరింటాడ సర్పంచ్ మండెల పావని స్వామి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

విశాలాంధ్ర-టి.నరసాపురం : క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని టి నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం. శ్రీనివాస్ తెలిపారు.ఆంధ్ర ప్రదేశ్ ప్రయివేటు అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్ మెంట్ చింతలపూడి జోన్ కమిటీ ఆధ్వర్యంలో టి నరసాపురం ఓం సాయి సూర్య యు పి స్కూల్ లో నిర్వహించిన ఆటల పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే క్రీడల పట్ల ఆశక్తి పెంచుకోవాలని తెలిపారు.అనంతరం క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి జోన్ కమిటీ కన్వీనర్ జె ఎమ్ క్సేవియర్,కార్యదర్శి కె. దిలీప్ కుమార్, కోశాధికారి కె.పవన్ కుమార్,జిల్లా నాయకులు బి ఎన్ సాగర్, పురం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో సేవలందించాలి

విశాలాంధ్ర - గణపవరం: ప్రకృతి విపత్తుల సమయంలో గ్రామాల్లో ప్రజలకు ఆపదలో ఆదుకోవడానికి, పునరావాస, సహాయక చర్యల్లో గ్రామస్థులను భాగస్తులు చేసి వారికి శిక్షణ ఇవ్వడానికి బాలింతలు, గర్భిణులు, స్త్రీలు, చిన్న పిల్లలకు అవసరమైన రక్షణ,పోషణ ,వైద్యం అందుబాటులో ఉండటానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో గద్దల జ్యోతిర్మయి వాలంటరీలను కోరారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న 'ఆపద మిత్రల 12 రోజుల శిక్షణను గణపవరం మండలం నుండి 15 మంది వలంటీర్స్, 5 గురు ఆశ కార్యకర్తలు ముగించుకుని వచ్చారని ఆయన అన్నారు. వీరు వివిధ ప్రకృతి, మానవ కారక విపత్తులు ఎలా సమర్థవంతంగా ఎదుర్కోవాలో శిక్షణ పొందినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయం ఏవో శ్రీలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

క్రిస్మస్ సందడి

విశాలాంధ్ర - లింగపాలెం : క్రిస్మస్ సందడి లింగపాలెం మండలంలోని అన్ని గ్రామాలలో ప్రారంభమైంది. క్రీస్తు పుట్టుక వేడుకను పురస్కరించుకుని చర్చిలను విద్యుత్ కాంతులతో అలంకరించారు. చర్చిలపై, క్రైస్తవ సోదరులు తమ ఇళ్ళపై స్టార్‌లను ఏర్పాటు చేశారు. క్రిస్మస్ వేడుకలు సందర్భంగా పలు గ్రామాలలో క్రిస్మస్ తాతతో ఇంటింటా ప్రచారం చేస్తూ సందడి చేస్తున్నారు. క్రైస్తవుల ఇళ్ళను సందర్శిస్తూ గురువులు ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. ధర్మాజీగూడెం భట్రాజులపేట ఎంపీపీ స్కూలులో జరిగిన వేడుకల్లో మత గురువు బల్హాజా పాల్గొని విద్యార్థులకు దుస్తులు, నోట్ పుస్తకాలు, బహుమతులు కానుకగా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఇఓ రామారావు పాల్గొన్నారు.

కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలి

మృతి చెందిన కార్మిక కుటుంబానికి రూ.50 లక్షల ఆర్థిక సహాయమందించాలి

విశాలాంధ్ర- తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం సమీపంలోని ఫుడ్ ఫ్యాట్స్ ఫెర్టిలైజర్స్ కర్మాగా రంలో అగ్నిప్రమాదానికి గురై గాయాల పాలైన కార్మికులకు అన్ని వైద్య సదుపాయాలు వున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో చేర్పించి మెరుగైన వైద్యం అందించాలని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. కర్మాగారంలో జరిగిన అగ్ని ప్రమాదంలో గాయాలకు గురై తాడేపల్లిగూడెంలో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను భీమారావు గురువారం సీపీఐ నాయ కులు ఎం.సీతారాం ప్రసాద్, మండల నాగేశ్వరరావు,బి.లక్ష్మినారాయణ, తాటికొండ గంగాభవాని, అల్లం రాము, వద్దాది మేరీ,టి.రాజు లతో కలిసి పరామర్శించారు. ఈసందర్భంగా పరామర్శకు విచ్చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ ప్రశాంతి లతో భీమారావు మాట్లాడుతూ ఫుడ్ ఫ్యాట్స్ ఫెర్టిలైజర్స్ కర్మాగారంలో అగ్నిప్రమాదంలో ఇప్పటికే ఒక కార్మికుడు చనిపోయారని, ఆరోగ్యం విషమంగా వున్న మరో ఇద్దరు రాజమండ్రి హాస్పి టల్లో వైద్య చికిత్స పొందుతున్నారని, ముగ్గురు తాడేపల్లిగూడెం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారని వీరిని కూడా మెరుగైన వైద్యం కోసం అన్ని వైద్య సౌకర్యాలు వున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో చేర్పించి మెరుగైన వైద్యం అందించాలని భీమారావు కోరారు.

మృతుని కుటుంబానికి రూ.50 లక్షలు ఆర్థిక సహాయమందించాలి

మృతి చెందిన కార్మిక కుటుంబానికి రూ.50 లక్షలు ఆర్థిక సహాయమందించాలని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు.కర్మాగారాల్లో ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని కోరారు.భద్రతా పరమైన చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహిస్తూ కార్మికుల ప్రాణాలు ఫణంగా పెడుతున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఫ్యాక్టరీల భద్రతా అధికారులు, ఫైర్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఫ్యాక్టరీల యాజమాన్యాలు తీసుకుంటున్న భద్రాతా చర్యలపై సంబంధిత శాఖల అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని భీమా రావు డిమాండ్ చేశారు.

విద్యారంగంలో దేశంలో ఏపీ అగ్రగామిగా ఉండాలి

విశాలాంధ్ర - భీమవరం టౌన్ : విద్యారంగంలో దేశంలోనే మన ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్ విద్యారంగ అభివృద్ధికి వేల కోట్ల నిధులను ఖర్చు చేస్తున్నారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో గురువారం నియోజకవర్గ పరిధిలోని విద్యార్థులకు ట్యాబ్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మాతృభాష తెలుగు భాషతో పాటు ఇంగ్లీష్ భాషను కూడా నేర్చుకుని భవిష్యత్తులో రాణించే విధంగా ముఖ్యమంత్రి చర్యలు తీసుకున్నారని తెలిపారు. భీమవరం నియోజకవర్గ పరంగా చూస్తే ముఖ్యంగా ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న 2007 మంది విద్యార్థులకు,200 మంది ఉపాధ్యాయులకు రూ.6 కోట్ల 62 లక్షల10వేల విలువ గల ట్యాబులను ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందన్నారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను విద్యార్థులు ఇంటిదగ్గర కూడా నేర్చుకోవడానికి వీలుగా ఈ ట్యాబులు పనిచేస్తాయన్నారు. పేద విద్యార్థులను గ్లోబల్ సిటిజెన్లుగా తీర్చిదిద్దేలా డిజిటల్ విధానంలో పాఠ్యాంశాలు సులభంగా అర్థమయ్యేలా మెరుగైన చదువుల దిశగా ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో ఎనిమిదో తరగతిలో అడుగుపెట్టిన విద్యార్థులకు ఇకనుండి ప్రతి ఏటా కూడా బైజూస్ కంటెంట్ తో కూడిన ట్యాబులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహారాజు, జడ్పిటిసి కాండ్రేగుల నరసింహారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, తాసిల్దార్ వై రవికుమార్, ఇంచార్జ్ ఎంపీడీవో రామచంద్ర ప్రభు, ఎంఈఓ వినాయకుడు, బీసీ సంక్షేమ జిల్లా అధ్యక్షులు కోడే యుగంధర్, భీమవరం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పేరిచర్ల సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షాన పోరాడేది సీపీఐ

విశాలాంధ్ర - తణుకు : ఈ నెల 26వ తేదీన జరగబోయే సీపీఐ ఆవిర్భావ దినోత్యవాన్ని ఘనంగా నిర్వహించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు అన్నారు. అప్పారీ శ్రీనివాస్ అధ్యక్షతన తణుకు పట్టణ సమితి సమావేశం గురువారం తణుకు వంక సత్యనారాయణ సూరాజ్య భవన్ భూపతిరాజు సుబ్బరాజు సమావేశ హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ పార్టీ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు మాట్లాడుతూ సీపీఐ 98వ ఆవిర్భావ దినోత్యవాన్ని దేశవ్యాప్తంగా అత్యంత ఘనంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించినప్పటి నుండి పేదల పక్షాన నిలబడి ఎన్నో ప్రజా ఉద్యమాలు, భూ పోరాటాలు చేసి భూమి లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించిన ఘనత సీపీఐ కు ఉందన్నారు. సోమవారం స్థానిక నరేంద్ర కూడలి వద్ద ప్రదర్శన కార్యక్రమం అనంతరం పార్టీ కార్యాలయం వద్ద పార్టీ పతాక కార్యక్రమంలో పెద్ద ఎత్తున సీపీఐ పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి గుబ్బల వెంకటేశ్వరరావు,బొద్దాని మురళీకృష్ణ, పెండ్యాల దత్తాత్రేయప్రసాద్, పుట్టా అమ్మిరాజు, బొద్దాని కృష్ణ కిషోర్, మందుల ముత్తయ్య, గుడేల్లి వెంకటేశ్వరరావు, కొమ్మెత్తుల రవికుమార్నూ,గెడ్డం వెంకటేశ్వరరావు, బంగారు నూకరాజు, మంతెన దుర్గాప్రసాద్, నూనె రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సి, ఎస్టి కేసుల సత్వర పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి

విశాలాంధ్ర - ఏలూరు : ఎస్సి, ఎస్టి కేసుల సత్వర పరిష్కారానికి అధికా రులు చొరవ చూపాలని, ఇందుకు రెవిన్యూ, పోలీస్, సోషల్ వెల్ఫేర్ శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని ఏలూరు రెవిన్యూ డివిజనల్ అధికారి కె. పెంచల కిషోర్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో రెవిన్యూ డివిజనల్ ఎస్సి, ఎస్ టి, మోనటరింగ్ కమిటీ సమావేశం ఆర్డిఓ పెంచల కిషోర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డిఓ మాట్లాడుతూ ఎస్సి, ఎస్ టి జనాభా అధికంగా ఉన్న ప్రాంతాల సమస్యల పరిష్కారానికి గ్రామాల వారీగా ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఏలూరు తహశీల్దారు సోమశేఖర్, ఎంపిడిఓ ప్రవీణ, ఎఎస్ డబ్ల్యూఓ లు బి.వి. రత్నం, ఎన్ఎ మంగతాయారు, తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా ఉత్పత్తుల వినియోగంతో ఆరోగ్యం

చేపలు, రొయ్యల వినియోగం పెంచాలని ఏలూరులో ర్యాలీ

విశాలాంధ్ర - ఏలూరు : రాష్ట్రంలో ఆక్వా ఉత్పత్తుల వినియోగాన్ని మరింత పెంచాల్సిన ఆవశ్యకత ఉందని, తద్వారా పోషకాహార లోపాలు నివారించడంతో పాటు, ఆ రంగంపై ఆధార పడి ఉన్న లక్షలాదిమంది జీవనోపాధికి మద్దతు ఇచ్చినట్టు అవుతుందని ఆక్వా ఉద్యోగుల అసోసి యేషన్ అధ్యక్షులు వి.రామకృష్ణ పిలుపుని చ్చారు. ఆక్వా ఉద్యోగుల అసోషియేషన్, ఎలూరు వారు 6వ వార్షికోత్సవం. సందర్భముగా చేపలు, రొయ్యలు తినడం వలన కలిగే ప్రయోజనాలు, స్థానిక వినియోగం పెంపొందించడానికి ప్రజల్లో అవగాహన పెంచడానికి సుమారు 70-80 మంది ఉద్యోగులుతో గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. పాత బస్ స్టాండ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ ఫైర్ స్టేషన్, కొత్త బస్టాండ్ మీదుగా సత్రం పాడు వరుకు సాగింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. చేపలు, రొయ్యల్లో 22 నుంచి 80శాతం వరకు ప్రోటీన్స్, అనేక పోషకాలు ఉన్నాయని, తేలికగా జీర్ణమయ్యే ఆహారం కావడంతో జీర్ణసంబంధ సమస్యలు రావన్నారు. సంఘం ఉపాధ్యక్షులు శేషసాయి, సెక్రటరీ వెంకట్‌లు మాట్లాడుతూ..చేపలు, రొయ్యలు ఆహారంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గిరిధర్ కుమారు, శ్యామ్, రాజు, వంశీ, డి.నానిబాబు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యధోరణితో నిర్వాసితుల జీవితాలతో ఆడుకోకండి

విశాలాంధ్ర - వేలేరుపాడు : నిర్లక్ష్య ధోరణితో నిర్వాసితుల జీవితాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు ఆడుకోవద్దని వెంటనే ప్రతి నిర్వాసిత కుటుంబానికి న్యాయం చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండి మునీర్ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వలన విలీన మండలాల్లో వేల కుటుంబాలు సర్వం కోల్పోతున్నా ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. నష్టపోతున్న నిర్వాసితుల జాబితాను 2017లోనే పూర్తి చేసినప్పటికీ నేటికీ ఒక్క కుటుంబానికి కూడా పూర్తిగా ప్యాకేజీ ఇవ్వకపోవడం సరైన చర్య కాదన్నారు. దరఖాస్తు చేసుకోమనడంతోనే ఏళ్ల గడిచిపోయాయని అనర్హుల జాబితాలో ఉన్న అర్హత కలిగిన ఒక్క కుటుంబాన్నికి కూడా భరోసా ఇవ్వని ప్రభుత్వాలు పాలన చేయడం నిర్వాసితుల దురదృష్టకరమన్నారు. ఏ ఒక్క నిర్వాసిత కుటుంబానికి అన్యాయం జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ చూస్తూ ఊరుకోదని తీవ్ర పోరాటాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి బాడిశ రాము, రామవరం సర్పంచ్ పిట్టా ప్రసాద్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సన్నేపల్లి సాయిబాబు, జిల్లా కౌన్సిల్ సభ్యులు కారం దారయ్య, మహిళా సమాఖ్య నాయకులు సోడే రమాదేవి, పిట్టా సాయమ్మ, సోడే భద్రకేళి, పిట్టా జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

'వాష్'కార్యక్రమంపై అవగాహన శిబిరం

విశాలాంధ్ర - పాలకొల్లు : యూనిసెఫ్, సార్డ్స్ సంస్థల సౌజన్యంతో గ్రామోదయ ట్రస్ట్ ఏలూరు వారి ఆధ్వర్యంలో పాలకొల్లు మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో, నీరు, పారిశుద్ధ్యం,పరిశుభ్రత అనే అంశాలపై ప్రజా ప్రతినిధులకు,మునిసిపల్ అధికారులకు, పౌర సమాజ సభ్యులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ ఎస్. ప్రమోద్ కుమార్ పాల్గొని మాట్లాడారు. మానవాళి మనుగడకు ఆరోగ్యమైన వాతావరణం ఎంతో అవసరం అన్నారు. అలాంటి వాతావరణానికి అవసరమయ్యే సహజ వనరుల్లో ఒకటైన నీటిని మనమే కలుషితం చేసుకొని ఆ కలుషిత నీటిని తాగి అనేక రోగాల బారిన పడుతున్నామన్నారు. నీటిని వృధా చేయకూడదని నీటి ప్రాముఖ్యతను గురించి మన భావి తరాలవారికి తెలిసేలా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు . ఈ అవగాహన కార్యక్రమాన్ని మరింత ఎక్కువమంది ప్రజలకు చేరేలా భవిష్యత్తులో మరింత విస్తృత ప్రచారం చేయాలని యునిసెఫ్ సంస్థను కోరారు.

సీపీఐ వార్షికోత్సవాన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర - కామవరపుకోట : భారత కమ్యూనిస్టు పార్టీ 98 వ వార్షికోత్సవాన్ని జయప్రదం చేయాలని సీపీఐ కామవరపుకోట మండల కార్యదర్శి టీవీఎస్ రాజు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం సీపీఐ పట్టణ కార్యదర్శి జి. సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్యాంకుల జాతీయకరణ రాజాభరణాల రద్దు తదితర ప్రధాన అంశాలపై వీరోచితంగా పోరాడిన భారత కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపక దినోత్సవం ఈనెల 26వ తేదీన జరుపుకుంటున్నామని అన్నారు. మండల సహాయ కార్యదర్శి అన్ని గ్రామ శాఖలో ఎర్రజెండాలు ఎగురువేసుకుని ఉదయం కామవరపుకోట సెంటర్లో జరిగే సభలో పార్టీ శ్రేణులు ప్రజాసంఘాల కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

సీపీఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

విశాలాంధ్ర - అత్తిలి : ఈ నెల 26న సీపీఐ 98 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వాడవాడలా పార్టీ పతా కాన్ని ఎగరవేయలని సిపిఐ శ్రేణులకు, సీపీఐ తణుకు ఏరియా కన్వీనర్ టి. అప్పలస్వామి పిలుపునిచ్చారు. గురువారం అత్తిలి మండలం లో అత్తిలి , ఉరదళ్ళ పాలెం , కంచుమర్రు తదితర గ్రామాలలో ఉన్న సీపీఐ నాయకులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ తణుకు ఏరియా కన్వీనర్ టి అప్పలస్వామి మాట్లాడుతూ ఎంతో మంది కమ్యూనిస్టులు దేశ స్వాతంత్రోద్యమ పోరాటంలో ప్రాణాలు అర్పించారన్నారు. దేశంలో ప్రజల కనీస అవసరాలైన కూడు , గూడు , గుడ్డ అందరికీ కల్పించాలని దోపిడి రహిత సమ సమాజ స్థాపన దిశగా సీపీఐ 98 ఏళ్ల గా ఉద్యమిస్తున్న దని తెలిపారు. ఈ నెల 26 తేదిన జరిగే సీపీఐ 98 వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కర్యక్రమంలో సీపీఐ నాయకులు జక్కుల ప్రసాద్ , లింగోలు సుబ్బారావు , మంగం పెంటయ్య , పంపన నరసింహ మూర్తి , కొల్లి సూర్యారావు తదితరుల పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమ నిధిని పునరుద్ధరించాలి

విశాలాంధ్ర- తాడేపల్లిగూడెం : జర్నలిస్టులు సంక్షేమనిధిని పునరుద్ద రించాలని ఏపీయూడబ్ల్యూజే జిల్లా కన్వీనర్ గజపతి ప్రసాద్ డిమాండ్ చేశారు. ఇటీవల మరణించిన తాడేపల్లిగూడెం ప్రైమ్ 9 విలేకరి రావూ రి చెన్నకేశవ సంతాప సభ గురువారం జరిగింది. కస్పాపెంటపాడు గ్రామంలో తాడేపల్లిగూడెం ప్రెస్ క్లబ్,ఏపీయూడబ్ల్యుజే ఆధ్వర్యంలో జరిగిన ఈ సభకు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చిక్కాల రామకృష్ణ అధ్యక్షత వహించారు. ముందుగా చెన్నకేశవ చిత్ర పటానికి పూలతో నివాళు లు అర్పించారు. రెండు నిమిషాల పాటు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చిక్కాల రామకృష్ణ మాట్లాడుతూ కేశవ అతి తక్కువ కాలంలోనే మంచి జర్నలిస్ట్ గా గుర్తింపు పొందాడన్నారు. ఆయన మరణం ప్రెస్ క్లబ్ కు తీర ని లోటని పేర్కొన్నారు. సీనియర్ జర్నలిస్టు అలమండ వెంకట నరసింహారావు మాట్లాడుతూ చెన్నకేశవ చాలా కాలం నుంచి జర్నలిస్ట్ కావాలని కోరుకునే వారన్నారు. ఆయన మరణం చాలా బాధాకరమని విచారం వ్యక్తం చేసారు. ఎలక్ట్రానిక్ మీడియా ప్రెసిడెంట్ రంగ సురేష్ మాట్లాడుతూ సేవాభావం, నిబద్ధత తో కేశవ మంచి జర్నలిస్ట్ గా గుర్తింపు సాధించారన్నారు. ఏపీయూడబ్లుజే జిల్లా కన్వీనర్ గజపతి ప్రసాద్ మాట్లాడుతూ కేశవ మరణం తాడేపల్లిగూడెం లో ప్రతీ ఒక్క విలేకరి ని తీవ్రంగా కలచివేసిందన్నారు. ఈ సభలో కె.పెంటపాడు గ్రామ సర్పంచ్ సత్యనారాయణ, ఉప సర్పంచ్ శివరామకృష్ణ, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి మైలవరపు రవికిరణ్, సీనియర్ జర్నలిస్ట్ లు చిట్యాల రాంబాబు, తేతలి గంగాధర్, సుందరనీడి వెంకట లక్ష్మయ్య, పాలడుగు సతీష్, పాలచర్ల రవీంద్ర, గొలిమె బుజ్జిబాబు, ఆకుల నవదుర్గా ప్రసాద్, బూర్గుల భానుశ్రీనివాస్, ఆకుల రమేష్, భాషంసెట్టి బాలబాలాజీ, రొక్కాల నాగబుజ్జి, కొత్తపల్లి గోపిచంద్, కొప్పిసెట్టి దుర్గాప్రసాద్, చింతకాయల దొరబాబు, కమ్ముల సుబ్బారాయుడు, టి.డి.పీ.నాయకుడు గండం సతీష్ తదితరులు కేశవ్ కు నివాళులు అర్పించారు.

విద్యార్థులు శ్రీనివాస రామానుజన్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

విశాలాంధ్ర-టి.నరసాపురం : విద్యార్థులు గణిత శాస్త్ర వేత్త శ్రీనివాస రామానుజన్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని విద్యా శాఖాధికారి టి.రామ్మూర్తి తెలిపారు. స్థానిక విజన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో జాతీయ గణిత దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయులు పురం శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ టి.రామ్మూర్తి మాట్లాడుతూ ప్రపంచ గణిత చరిత్రలో లెక్కల మాంత్రికుడుగా పేరుపొందిన మహామేధావి రామానుజన్ అని తెలిపారు. రామానుజన్ గణితంలో ఉపాధ్యాయులు సైతం ఆశ్చర్యపడేలా లెక్కలు చేసేవారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయనీలు విజయలక్ష్మి, అరుణ, మహాలక్ష్మి, వరలక్ష్మి, లావణ్య, అనూష,కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో గ్రామ స్వరాజ్యం

విశాలాంధ్ర - కైకలూరు : గాంధీజీ గ్రామ స్వరాజ్యాన్ని అంబేద్కర్ సమసమాజాన్ని ఏకకాలంలో ఆవిష్క రిస్తున్న ఆదర్శనేత ముఖ్య మంత్రి జగనన్న అని కైకలూరు శాసనసభ్యులు దూలం నాగేశ్వర రావు అన్నారు.గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో 120 వరోజు కార్యక్రమానికి ఆయన మండలం తామరకొల్లులో శ్రీకారం చుట్టారు. తొలుత గ్రామ సర్పంచ్, మండల వైకాపా అధ్యక్షులు భట్రాజు శివాజీ ఆధ్వర్యంలో గ్రామస్థులు పెద్దఎత్తున ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావుకు పూలమాలలు, దుశ్శాలువలు పూలజల్లులు బాణాసంచాలు మేళతాళాలతో స్వాగతం పలికారు.తదుపరి గ్రామంలోని డాక్టర్ అంబేద్కర్, డాక్టర్‌వై ఎస్.ఆర్ విగ్రహాలకు ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించిన పిదప గ్రామ సచివాలయంలో సచివాలయ సహాయకులు, గ్రామ వాలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వపరిపాలన-సుపరిపాలన అనేది గత పాలకుల మాటలకే పరిమితం చేస్తే దాన్ని మన కళ్ళముందు ఆవిష్కరించి ఆచరణాత్మక ప్రణాళికతో అడుగులు వేసి అమలు చేస్తున్న అరుదైన పాలనాదక్షుడు సీఎం జగనన్న అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అడివి వెంకట కృష్ణ మోహన్, జడ్పీటీసీ కురేళ్ల బేబీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు విద్యపై దృష్టి పెట్టాలి

విశాలాంధ్ర - గణపవరం: విద్యార్థులు విద్యపై దృష్టి పెట్టి మంచి విద్యార్థినిగా గుర్తింపు పొందాలని తాడేపల్లిగూడెం మోడల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ నతానియల్ అన్నారు. గురువారంశ్రీ చింతలపాటి వరప్రసాద మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వాగత వేడుకలు (ఫ్రెషర్స్ డే) ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాకలపాటి నిర్మల కుమారి మాట్లాడుతూ ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థినీ, విద్యార్థులకు సీనియర్ విద్యార్థినీ, విద్యార్థులు స్వాగత వేడుకలు నిర్వహించడం పరిపాటి అని ఆమె అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రణాళిక, అభివృద్ధి భాగం (సి.పి.డి.సి) సభ్యులు చింతలపాటి వెంకట సత్యనారాయణ రాజు, నడింపల్లి శ్రీరామ్, అవంతి సత్తిబాబు,వైస్ ప్రిన్సిపాల్ పి. మధురాజు, డాక్టర్ టి. అక్కిరాజు, డాక్టర్ కె.స్వరూప రాణి,డాక్టర్ జి.వెంకటరావు, డాక్టర్ జి. వెంకటరమణ, తదితర అధ్యాపక, అధ్యాపకేతర విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఏకకాల పరిష్కారం ప్రభుత్వం లక్ష్యం

విశాలాంధ్ర - కైకలూరు : ఏకకాల పరిష్కారం క్రింద ఇంటి పై సర్వహక్కులు కలిగిన పట్టాలు అందుకుంటున్న లబ్ధిదారు లకు అభినందనలు అని జగనన్న మీ ఇంటిపై శాశ్వత హక్కును మీకు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఇంకా మిగిలిన వారు కూడా సద్విని యోగ పరచుకోవాలని కైకలూరు శాసన సభ్యులు దూలం నాగేశ్వరరావు అన్నారు. గురువారం కైకలూరు మండలంలోని తామరకొల్లు గ్రామంలో గ్రామ సచివాలయం వద్ద 62 మంది అక్కచెల్లెమ్మలకు వన్ టైమ్ సెటిల్మెంట్ ద్వారా వచ్చిన ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని పట్టాలను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అడివి వెంకట కృష్ణ మోహన్, జడ్పీటీసీ కురేళ్ల బేబీ, సర్పంచ్ భట్రాజు శివాజీ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

బాబురావుకు డాక్టరేట్

విశాలాంధ్ర-ఉంగుటూరు : ఉంగుటూరు పశు గణాంక అధికారి మల్లిపూడి చిన్న బాబు రావు గౌరవ డాక్టరే అవార్డును అందుకున్నారు. న్యూఢిల్లీ సౌత్ వెస్ట్రన్ అమెరికా యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అవార్డు పొందానని బాబురావు గురువారం ఉంగుటూరులో విలేకరులకు తెలిపారు. యూనివర్సిటి చాన్సులర్ జాన్, డైరెక్టర్ అభిషేక్, ఎమ్మెల్యే డాక్టరు సోమనాథ్ బాటియా వారి చేతుల మీదుగా బాబురావు డాక్ట రేట్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా బాబురావును మండలంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు అభినందించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ పశు గణాంకణ లో విశేష సేవలు అందించి నందుకుగాను గౌరవ డాక్టరేట్ అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

శ్రీ చైతన్యలో ఘనంగా గణిత దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - ఏలూరు : స్థానిక శాంతినగర్ శ్రీ చైతన్య పాఠశాలలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన గణిత శాస్త్రవేత్త సర్. శ్రీనివాస రామానుజన్ 135వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపా ధ్యాయు రాలు శివకుమారి మాట్లాడుతూ మానవుని దైనందిన జీవితం-గణిత శాస్త్రం విడదీయలేనివని, ఒక విద్యార్థి పరిణితిలో గణిత శాస్త్రం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. శ్రీ చైతన్య పాఠశాలలో విద్యనభ్యసించి ఐఐటీయన్లుగా, శాస్త్రవేత్తలుగా అభివృద్ధి చెందిన అనేక విద్యార్థులను గుర్తుచేస్తూ, అలాంటి ఎంతోమందికి సర్ .శ్రీనివాస రామానుజన్ స్ఫూర్తి అన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన అనేక గణిత నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులంతా ప్రదర్శనను ఉత్సాహంతో సందర్శించారు. సభలో పాఠశాల ఎకడమిక్ డీన్ జె. సంజీవ్ కుమార్, ప్రైమరీ ఇంచార్జ నరీనా, గణిత అధ్యాపక బృందం, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన పాల వినియోగానికి పాల వెల్లువ కేంద్రాలు

విశాలాంధ్ర - లింగపాలెం : జగనన్న పాల వెల్లువ ద్వారా పాలను సేకరించటం వల్ల ఉత్పత్తిదారులకు గిట్టుబాటు ధర వస్తుందని, వినియోగదారులకు మంచి పాలను సరఫరా చేయటం జరుగుతుందని మండల పరిషత్ అధ్యక్షురాలు ముసునూరు వెంకటలక్ష్మి అన్నారు. నరసన్నపాలెంలో జగనన్న పాల వెల్లువ పాల కేంద్రాన్ని ఈమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈమె మాట్లాడుతూ లింగపాలెం మండలంలో 13 గ్రామాలలో పాల వెల్లువ కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ఇప్పటికే యడవల్లి, భోగోలు, అయ్యపరాజుగూడెం, మఠంగూడెం, ధర్మాజీగూడెం, కొత్తపల్లి, వెంకటాపురం, టీసీహెచ్ఆర్‌పాలెం, నరసన్నపాలెంలలో కేంద్రాలు ప్రారంభించారని అన్నారు. మరికొన్ని గ్రామాలలో కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయని, ఈ కేంద్రాల నుంచి రోజుకు దాదాపు వెయ్యి లీటర్ల పాలను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. పాల వెల్లువ పాల కేంద్రాల వల్ల నకిలీ పాల తయారీ నిర్మూలన అవుతుందని అన్నారు. కార్యక్రమంలో ముసునూరు వెంకటేశ్వరరావు, మహిళా పాల ఉత్పత్తిదారులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర - ఏలూరు : దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి పుట్టినరోజు వేడుకలు గురువారం ఉదయం ఏలూరులోని దెందులూరు పార్టీ కార్యాలయంలో పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు ప్రజాప్రతి నిధులు, అధికారులు ఉద్యోగులు,పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు సామాజిక మాధ్యమల ద్వారా శుభాకాంక్షలు తెలిపారు.ఎమ్మెల్యే వెంటటేశ్వర స్వామిని దర్శించుకునేఉదుకు తిరుపతి వెళ్లడంతో ఆయన తండ్రి కొఠారు.రామచంద్రరావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా కొఠారు రామచంద్రరావు మాట్లాడుతూ దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారని తెలిపారు.

లిటిల్ బడ్స్‌లో మ్యాథ్స్‌డే వేడుకలు

విశాలాంధ్ర - ఏలూరు : స్థానిక పడమరవీధిలోని లిటిల్‌బడ్స్ స్కూల్ నందు శ్రీనివాసరామానుజన్ జన్మ దినం సందర్భంగా మ్యాథ్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులందరూ వివిధ రకాలైన మ్యాథ్స్ నమూనా లను తయారుచేసి బహుఆహుతు లను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మ్యాథ్స్ ఎగ్జిబిషన్ బాగా ఆకర్షించింది. విద్యార్థులు మ్యాథ్స్‌లో తయారు చేసిన నమూనాలు, చార్టులు ద్వారా మ్యాథ్స్ ప్రాధాన్యతను అందరికీ తెలియజేశారు. మ్యాథ్స్ టీచర్స్ మ్యాథ్స్‌డే యొక్క ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బాగంగా విద్యార్థులకు ప్రధమ, ద్వితీయ, తృతీయ బహుమతులను డైరెక్టర్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్స్ వై.ఆర్.కిషోర్, ఎం. శ్రీనివాస్, జి.సత్యనారాయణ, ఎం.కుమార్, ఇన్‌చార్జిలు, ఉపాధ్యాయని,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఎస్.ఎస్.సి. టెస్ట్ పేపర్స్ పంపిణీ

విశాలాంధ్ర- కాళ్ళ : మండలం లోని జువ్వలపాలెం ఉన్నత పాఠశాల నందు ప్రముఖ దాత గోకరాజు వినోద్ రంగరాజు (వినోదబాబు) పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు యూ.టి.ఎఫ్ ఆధ్వర్యంలో తయారుచేసిన టెస్ట్ పేపర్స్ ఉచితంగా అందించారు. యూ.టి.ఎఫ్.మండల అధ్యక్షుడు రాజ కోటేశ్వర స్వామి మాట్లాడుతూ ఈ టెస్ట్ పేపర్లు నిపుణులైన ఉపాధ్యాయులచే రూపొందించబడినవి అని, ఆరు సబ్జెక్టులకు సంబంధించి సబ్జెక్టుకి 4 మోడల్ పేపర్లు చొప్పున 24 మోడల్ పేపర్లు ఉంటాయి అని అన్నారు. ప్రధానోపాధ్యాయులు త్రినాధులు మాట్లాడుతూ ఈ టెస్ట్ పేపర్స్ చదవడం ద్వారా విద్యార్థులు మంచి మార్కులు పొందుతారు అని చెప్పారు. జిల్లా కౌన్సిలర్ అప్పలనాయుడు మాట్లాడుతూ సహృదయంతో పుస్తకాలు అందించిన వినోద్ బాబుకు అభినందనలు తెలియ చేసారు. విద్యార్థులు రాబోయే పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శర్మ , ప్రసాద్ , రజని , సత్యవతి, మహాలక్ష్మి ,పాల్గొన్నారు.

యూటిఎఫ్ కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర - లింగపాలెం : ప్రభుత్వం నూతన విద్యా విధానం పేరుతో ప్రాథమిక పాఠశాలలను కుదిస్తుందని యూటిఎఫ్ రాష్ట్ర నాయకులు నరసింహారావు అన్నారు. ఉపాధ్యాయ పోస్టులను తగ్గిస్తుందని, డిఎ బకాయిలు, పీఆర్సీ ఎరియర్స్ ఇవ్వటంలేదని ఆరోపించారు. ఈ సందర్భంగా లింగపాలెం మండల యూటిఎఫ్ కార్యవర్గాన్ని ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పి.లక్ష్మణుడు, ఉపాధ్యక్షులుగా జి.శ్రీనివాసరావు, సజిదా బేగం, ప్రధాన కార్యదర్శిగా ఎస్.రమేష్, కోశాధికారిగా ఎస్.కె.బాజీ, మహిళా కార్యదర్శిగా జి.వి.రమణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - భీమడోలు : భీమడోలు మండలంలోని వివిధ గ్రామపంచాయతీ లలో ఖాళీగా ఉన్న ఐదు గ్రామ వాలంటీర్ల పోస్టుల భర్తీకి ఆన్లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భీమడోలు ఎంపిడీవో రాఘవన్ తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ఈనెల 27వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. దరఖాస్తుదారు లకు 29వ తేదీన భీమడోలు మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తారని తెలిపారు. అంబరుపేటలో ఖాళీగా ఉన్న రెండు పోస్టులు, ఆగడాలలంక, పోలసానిపల్లి, సూరప్పగూడెం గ్రామాల్లోని ఒక్కో పోస్టుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాఘవన్ ఒక ప్రకటనలో తెలిపారు.

హెూప్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల క్రిస్మస్

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం : సర్వ మానవాళి రక్షణకు యేసు క్రీస్తు ఈ లోకంలో జన్మించారని హెూప్ మినిస్ట్రీస్ డైరెక్టర్ జాషువా గెద్దం అన్నారు.గురువారం స్థానిక చిట్టూరి గణేశ్వరరావు టౌన్ హాల్ నందు జర్నలిస్టుల ఐక్య క్రిస్మస్ హెూప్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో జరిగింది.ఈ సందర్భంగా జాషువా గెద్దం క్రిస్మస్ విశిష్టత ను వివరించారు.అనంతరం విలేకరులతో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేసి,క్యాండిల్ సర్వీస్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ పంతగాని వెంకన్న, ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యుడు వాసా సత్యనారాయణ,సీనియర్ జర్నలిస్టులు కె.వి.రమణారావు, డి.వి.ఎల్.ఎన్.స్వామి, డి.వి.భాస్కర రావు, కె.వెంకట్, పరసా రాంబాబు, ఎ.రంగా,ఎన్. బాలసుబ్రహ్మణ్యం, ఎల్.నాగకుమార్, చందు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం రూరల్ : పెదతాడేపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ గర్వించదగిన గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.కె. లాల్ ఓటీ మాట్లాడుతూ గణిత శాస్త్రాన్ని అభివృద్ధి చేయడంలో భారతీయులు విశేషమైన కృషి చేశారని అన్నారు. వారిలో ఆర్యభట్ట భాస్కరాచార్య, వరాహమిహిరుడు వంటివారు ఉన్నారన్నారు. అదే ప్రాధాన్యతలో భాగంగా ప్రపంచానికి గణిత శాస్త్రాన్ని ఎశ్రీనివాస రామానుజన్ పరిచయం చేశారన్నారు. పేదరికం నుండి గణిత మేధావిగా గుర్తింపు పొందిన రామానుజన్ ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ప్రతీ విద్యార్థి గణిత శాస్త్రం పై పట్టు సాధించాలని అన్నారు. ప్రస్తుతం ఉన్న సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా చేసుకుని గణిత శాస్త్రంలో నైపుణ్యాభివృద్ధి సాధిస్తే ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా లభిస్తాయన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రవేటు పాఠశాలల్లో గణిత దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బివిఎస్ సునీత, పి.కాశీ విశ్వనాథ్, ఆర్.వి.రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు హైస్కూల్‌లో గణిత దినోత్సవం

విశాలాంధ్ర-ముసునూరు: ప్రతి విద్యార్థి శ్రీనివాస్ రామానుజమ్ వలే గొప్ప శాస్త్రవేత కావాలని ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాస్ అన్నారు .గురువారం మండలంలోని పలు పాఠశాలలో గణిత దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆ పాఠశాల ఉపాధ్యాయులైనా రత్నమాల,నాగేశ్వరరావు,బాబురావులచే విద్యార్థులు గణిత శాస్త్రంతో కూడిన సైన్సు ఫార్కు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.సుకుమార్, అల్లాభిక్షు, రంగారావు, యువరాజు, రత్నమాల, నాగేశ్వరరావు,బాబురావు,శ్రీనివాసరావు ,విద్యార్థులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

విశాలాంధ్ర - దెందులూరు : వినియోగదారుల సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం కొవ్వలి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వినియోగదారుల హక్కులపై అవగాహన సదస్సును నిర్వహించారు ఈ అవగాహన సదస్సులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. రాజేశ్వరి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఏదో ఒక సందర్భంలో వినియోగ దారుడై ఉన్నాడని, ఒక పెన్సిల్ దగ్గర నుండి ఏ వస్తువు కొన్న రసీదును తప్పనిసరిగా తీసుకోవా లని, కొన్నింటిపై కాలాతీతమైన తేదీలు ఉంటాయని వాటిని గమనించి వస్తువులను తీసుకోవాలని, మనం ఖరీదు చేసిన వస్తువులపై ఏ విధమైన నష్టం జరిగిన నష్టపరిహారము కొరకు జిల్లా వినియోగదారుల సంఘాన్ని ఆశ్రయించవచ్చని, వినియోగదారుల సంఘం నందు ఒక కాగితంపై స్పష్టంగా విషయాన్ని తెలియజేసి వారికి అర్జీ పెట్టుకున్న సంబంధిత వ్యక్తులను లేదా సంస్థలను నోటీసు ఇవ్వడం ద్వారా వాళ్ల పిలిపించి తగిన నష్ట పరిహారాన్ని చెల్లించే విధంగా తీర్పు విరవిస్తారని, డబ్బు పెట్టి కొన్న ఏ వస్తువుల పైన అయినా ఏ సర్వీసులపై నైనా ఈ చట్టం వర్తిస్తుందని తెలియజేశారు, ఈ అవకాశాన్ని ప్రతి వ్యక్తి వినియోగించుకోవాలని ఏ విధమైన న్యాయ సహాయం కావలసిన జిల్లా న్యాయ సేవాద సంస్థను కానీ లేదా దగ్గరలోని మండల న్యాయ సేవాధికార సంస్థలు కానీ సంప్రదించ వచ్చని తగిన ఉచిత న్యాయ సహాయం అందిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ లాయర్లు కట్టా సత్యనారాయణ,కూన. కృష్ణా రావు, సి.ఎ.పి.స్,. ఏ. శిరీష,బి. పెదబాబు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : బోడిగూడెం గ్రామ సచివాలయం లో ఏఎన్ఎం గా పనిచేస్తున్న అంకాల గూడెం గ్రామానికి చెందిన దుర్గా ప్రభీవంతి విధులకు హాజరు కావడానికి స్కూటీపై వెళుతున్న సమయంలో అంకాల గూడెం మార్గమధ్యలో పుల్లల లోడుతో వస్తున్న లారీ ఆమెను ఢీ కొనడంతో ఆమె రెండు కాళ్లు నుజ్జు నుజ్జు అయ్యాయి. ఆమె రెండు కాళ్లు పోగొట్టుకొని ఇంటి వద్దనే చికిత్స పొందుతూన్న ఆమెను గురువారం ఏపీ యునైటెడ్ వార్డ్ హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున యూనియన్ సభ్యులు లక్ష రూపాయలు చెక్కును ఆమెకు అందజేశారు. యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఏ .వి .నాగేశ్వరరావు మాట్లాడుతూ తమ కుటుంబానికి అండగా యూనియన్ ఉంటుందని ఆమెకు భరోసా ఇచ్చారు. వెల్ఫేర్ అసోసియేషన్ లో సభ్యులకు ఏ విధమైన ఆపద వచ్చినా యూనియన్ ముందుంటుందని అసోసియేషన్ లో ఉన్న ప్రతి ఒక్కరూ ఒకరికి ఒకరు సహాయ సహకారాలు అందచేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బి ప్రభారాణి, జిల్లా అధ్యక్షులు ఆర్ భాగ్యలక్ష్మి, జిల్లా సెక్రటరీ టి శ్రీ లక్ష్మి, ఏ దేవకి, పరమేశ్వరి, జగన్మోహన్రావు, సిహెచ్ సత్యనారాయణ, కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ యూనియన్ నాయకులు డి. దయామని, డి.వేణుగోపాలరావు, శుక్ల బోయిన రాంబాబు, ఆకుల దుర్గారావు పాల్గొన్నారు.

కుంతలగూడెంలో గణిత దినోత్సవం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : గణిత శాస్త్రంలో అనేక అద్భుతమైన సిద్ధాంతాలను సృష్టించిన మహెూన్నత వ్యక్తి శ్రీనివాస రామానుజన్ అని ఉపాధ్యాయులు రాయపూడి వెంకట రమణ పేర్కొన్నారు. కొయ్యలగూడెం మండలం కుంతల గూడెం గ్రామంలో ఫ్రీ హై స్కూల్ వద్ద గణిత దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయురాలు కె.కనకమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కనకమ్మ మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ గణితానికి చేసిన సేవలను బాలబాలికలు ఆదర్శంగా తీసుకోవా లని గణిత మెలకువలను తెలుసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎం. విజయ్, కె. అమృత, బాల బాలికలు పాల్గొన్నారు.

విద్యార్థులకు టాబ్ ల పంపిణీ

విశాలాంధ్ర- పోడూరు : మండలంలోని వివిధ గ్రామాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి విద్యార్థినులకు పోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్ నందు గురువారం టాబ్ లను జెడ్ పి టి సి గుంటూరు పెద్దిరాజు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ముఖ్యమంత్రి జగన్మో హన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు టాబ్‌లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ నాడు నేడు కార్యక్రమం చేపట్టి కోట్లాది రూపాయల వ్యయంతో పాఠశాల భవన నిర్మాణాలు పాఠశాలల ఆధునీకరణ వసతుల కల్పన వంటివి చేపట్టారన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీపీ సబ్బితి సుమంగళి సర్పంచ్ శే ట్టిభత్తుల సువర్ణ రాజు ఎంపీటీసీ పోడూరి సువర్ణ రాజు ఎంపీటీసీ పోడూరి నాగరాజు స్థానిక వైసీపీ నాయకులు పోతుముడి రామచంద్రరావు చేకూరి సూరిబాబు రుద్రరాజు శివాజీ రాజు, పోడూరి సాయి తదితరులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతే జగన్మోహన్ రెడ్డి లక్ష్యం

విశాలాంధ్ర- ఉండి : మహిళాభ్యున్నతే ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని ఉండి నియోజకవర్గ ఇన్చార్జ్ పివిఎల్ నరసింహారాజు అన్నారు. గురువారం ఉండి సచివాలయం రెండవ పరిధిలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పివిఎల్ నరసింహారాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మహిళాభ్యున్నతే ముఖ్యమంత్రి లక్ష్యమని ప్రతి సంక్షేమ పథకాలను మహిళలకు అనుసంధానం చేసే రూపొందించా రన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జానపద సృజనాత్మక అకాడమీ కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, ఎంపీపీ ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, జడ్పిటిసి రణస్థుల కనకదుర్గ మహంకాళి, గ్రామ సర్పంచ్ కమతం సౌజన్య బెనర్జీ, ఉప సర్పంచ్ గొట్టుముక్కల కళ్యాణ్ వర్మ తదితరులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆనాడు ప్రతిపక్ష నేతగా 3645 కిలోమీటర్లు పాదయాత్ర చేశారని ఆ పాదయాత్రలో ఇచ్చిన వాగ్దానాలను అధికారం చేపట్టిన తర్వాత నవరత్నాల పేరుతో పారదర్శకంగా పార్టీలకతీతంగా ప్రతి లబ్ధిదారునికి అందజేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు కరిమెరక మల్లికార్జునరావు, మండల పార్టీ అధ్యక్షులు పెన్మెత్స ఆంజనేయరాజు, చెరుకువాడ సర్పంచ్ కొండవీటి సాంబశివరావు, ఎంపీటీసీ గిరడా రమణ, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు .

గణితశాస్త్ర దినోత్సవం

విశాలాంధ్ర- తణుకు : నేషనల్ మేథమేటిక్స్ డే సందర్భంగా గురువారం స్థానిక యస్. కె. యస్. డి మహిళాకళాశాలలో జాతీయ స్థాయిలో బెస్ట్ స్టూడెంట్ అవార్డు పోటీలను నిర్వహించారు. గణితశాస్త్రం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్ర విభాగాలలో పీ. పీ. టి ప్రెజెంటేషన్ ను పరిశీలించి గెలుపొందిన విద్యార్థులకు 1000రూ.. నగదు, షీల్డ్ ను కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి బహుమతుల ప్రధానం చేశారు.గణితశాస్త్రం విభాగం నందు ఐడియల్ కాలేజ్ కాకినాడ నుండి ఎం. డి మెహబూబ్ ఆలీ, భౌతిక శాస్త్రం విభాగం నందు ఎస్. కె. ఎస్. డి కాలేజ్ తణుకు నుండి ఎ. రోషిణి, రసాయన శాస్త్రం విభాగం నందు ఎస్. కె. ఎస్. డి కాలేజ్ తణుకు నుండి ఎం. పీ. ఎస్. వి లక్ష్మి లు అవార్డులు అందుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కరుటూరి రామకృష్ణ, పరిపాలనాధికారి డా.. డి. సుబ్బారావు, కన్వీనర్, వైస్ ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ యు. లక్ష్మిసుందరిబాయ్, కె. పద్మాజారాణి, కె. వి రామకృష్ణ, డా.. ఎం. శ్రీదేవి, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది తదితరులు విజేతలను అభినందించారు.

భారీ అన్నదానం

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట కోట్లమ్మ చెరువు వద్ద కొత్త పోలీస్ స్టేషన్ పక్కన స్వయంభు శ్రీ వీరాంజనేయ స్వామి వారి ఆలయ ప్రాంగ ణంలో నూతనంగా నిర్మించిన శ్రీ షిరిడి సాయిబాబా ఆలయ నాలుగవ వార్షికోత్సవం గురువారం అత్యంత వైభవంగా ముగిసాయి. ఆలయంలో ఈనెల 20వ తేదీన సాయి నామస్మరణ, 21వ తేదీన సచ్చరిత్ర పారాయణలు నిర్వహించారు. గురువారం బాబా వారికి భక్తిశ్రద్ధలతో పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పలు రకాల గులాబీ పువ్వులతో బాబా వారికి అలంకారం చేపట్టారు. మధ్యాహ్న హారతి ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలోనూ, రోడ్డుపైన తరలివచ్చిన వేలాది మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ పూజల్లో పెద్దాపురం పారిశ్రామికవేత్త మట్టే శ్రీనివాస్ విద్యుల్లత దంపతులు పాల్గొని ఆర్థిక సహకారం అందజేశారు. ఈ పూజలో వీరాంజనేయ స్వామి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త క్షత్రి సీతారాం సింగ్, సాయిబాబా ఆలయ ధర్మకర్త క్షత్రి రాజా రామ్ సింగ్, వారి కుటుంబ సభ్యులు, దాతలు, ఆలయ అన్నదాన కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సుమారు 2000 మందికి అన్నదానం నిర్వహించారు.

భట్నవిల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం మండలం భట్నవిల్లిలో గురువారం జరిగిన గడప గడపకి మన ప్రభుత్వం కార్యక్రమనికి అనూహ్య స్పందన లభించింది. రాష్ట్ర రవాణా శాఖామంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు పినిపే శ్రీకాంత్‌తో కలిసి ఇంటింటికి తిరిగి జగనన్న ప్రభుత్వం అందిస్తున్న పథకాలు గురించి వివరించారు. కార్యక్రమంలో యువనేత పినిపే శ్రీకాంత్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. యువకులు శ్రీకాంత్‌తో ఫోటోలు దిగేందుకు పోటీలు పడుతున్నారు. మహిళలు తమ తమ ఇళ్లవద్ద హారతులు ఇచ్చి దీవించారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి పందిరి శ్రీహరి, మండల పరిషత్ అధ్యక్షురాలు కుడుపూడి భాగ్యలక్ష్మి బాబు, గ్రామ సర్పంచ్ తిరుకోటి సుజాత, ఐవి గోపాల కృష్ణ, యువ నాయకుడు తిరుకోటి సతీష్ కుమార్, పలువురు ప్రముఖులు మహిళలు పాల్గొన్నారు.

ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో మూడు రోజుల వర్క్ షాప్

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం, సూరంపాలెం నందు గల ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజ నీరింగ్, హ్యుమానిటీస్ విభాగం ఆధ్వర్యంలో "సైన్సు ఫర్ సస్టైనబుల్ డెవలప్మెంట్" అనే అంశం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రారంభోత్సవంలో కళాశాల ప్రిన్సిపాల్ డా ఆదిరెడ్డి రమేష్ మాట్లాడుతూ విజ్ఞానశాస్త్రం యొక్క ఆవశ్యకత, మన దైనందిన జీవితంలో దాని ప్రాముఖ్యతను వివరించారు. కళాశాల డీన్ డా పి రవి కుమార్ మాట్లాడుతూ ప్రతి పరిశోధన మరియు ఆవిష్కరణల వెనుకప్రాథమిక విజ్ఞానం ముఖ్య పాత్ర ఉంటుందని తెలియజేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కృష్ణా యూనివర్సిటీ రసాయన శాస్త్రం విభాగం ప్రొఫెసర్. ఆంధ్రప్రదేశ్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, గౌరవ సెక్రటరీ "ప్రొఫెసర్ మండవ వెంకట బసవేశ్వర రావు మాట్లాడుతూ, మన భారతదేశం ఎంతో మహెూన్నతమైనది, వైజ్ఞానిక రంగంలో మనం ప్రధములుగా ఉండటానికి కొత్త ఆవిష్కరణలు, పరిశోధనల దిశగా సాగాలి, ఇండియా యువ మానవ వనరులు పుష్కలంగా కలిగి శక్తివంతమైన దేశమని అభిప్రాయపడ్డారు. బేసిక్ సైన్సెస్ విభాగాధిపతి డాక్టర్ సి. రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. తద్వారా బాహ్య ప్రపంచంలో జరిగే వైజ్ఞానిక మార్పులు, అవకాశాల్ని అందిపుచ్చుకోవడంవంటివి చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఇతర రసాయన శాస్త్ర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం



విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం : ముఖ్యమంత్రి జగన్ పాలనలో రాష్ట్రం దిన దినాభివృద్ధి చెందు తుందని చింతలపూడి శాసనసభ్యులు వి.ఆర్. ఎలిజా అన్నారు. గురువారం జంగారెడ్డి గూడెం పట్టణంలో పలు వార్డుల్లో రూ. 75 లక్షల రూపాయలతో నిర్మించిన సిసి రోడ్లను ఎమ్మెల్యే ఎలీజా ప్రారంభించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నామని అన్నారు. రానున్న కాలంలో పట్టణంలోని మరిన్ని వార్డులలో ప్రజలకు ఉపయోగపడే రోడ్లను నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమం అనంతరం స్థానిక పదకొండవ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలిజా ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ పి. భవాని ప్రసాద్ ,వైస్ చైర్మన్లు ముప్పిడి వీరాంజనేయులు, కంచర్ల వాసవి రత్నం , వైసీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, పట్టణ అధ్యక్షుడు పి పి ఎన్.చంద్ర రావు, ఆయా వార్డు కౌన్సిలర్లు, వైసిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

మాకొద్దు బాబోయ్ ముద్దరబోయిన



విశాలాంధ్ర - చాట్రాయి : వద్దు బాబోయ్ ముద్రబోయిన అంటూ తెలుగు తమ్ముళ్లు ఏకోన్ముఖంగా చెప్పిన మాట ఇది. తెలుగుదేశం పార్టీలో గ్రూపు వివరాలు ఉధృతమై పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు దృష్టికి నారా లోకేష్ , అచ్చెం నాయుడు, ఫైవ్ మాన్ కమిటీ వరకు వెళ్లి ముద్దరభోయినపై ఏ విధమైన ఫిర్యాదులు చేశారో రాష్ట్ర పార్టీ నుండి పరిశీలకుడుగా వచ్చిన బొడ్డు వేణుగోపాల్ తో కూడా అదే వాదన వినిపించినట్లు విశ్వసనీయ వర్గాల కథనం .గురువారం చాట్రాయి వచ్చిన బొడ్డు వేణుగోపాల్ తో కూడా అత్యధిక గ్రామాల నాయకులు గంటల తరబడి ముద్దర బోయిన పనితీరుపై తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఎట్టిపరిస్థితుల్లోనూ సీటు ఇవ్వద్దని వేడుకున్నట్లు తెలుస్తోంది.

క్రోమా ఫెస్టివల్ ఆఫ్ డ్రీమ్స్ ప్రారంభం

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం: క్రిస్మస్ న్యూ ఇయర్ పండుగలు సందర్భంగా క్రోమా ఫెస్టివల్ ఆఫ్ డ్రీమ్స్ ప్రారంభించారు. ఓమ్నీ ఛానెల్ ఎలక్ట్రానిక్స్ రిటైలర్, టాటా గ్రూప్‌కు చెందిన క్రోమా ఇప్పుడు అత్యంత ఉత్సాహపూరితమైన ఆఫర్లను గాడ్జెట్స్ అప్లయెన్సస్‌పై అందిస్తుంది. ఈ ఆఫర్లు ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు, హెూమ్ అప్లయెన్సస్, టీవీలు మరెన్నో వాటిపై లభిస్తాయి. ఈ సేల్ స్టోర్ల తో పాటుగా క్రోమా డాట్ కామ్‌పై అత్యుత్తమ హాలీడే సీజన్‌గా చెప్పబడుతున్న జనవరి 02, 2023 వరకూ లభ్యమవుతాయి. అదనంగా క్రోమా ఇప్పుడు మూడు బ్యాండ్స్‌ను పరిచయం చేసింది. రెడ్ 10 శాతం తగ్గింపు, గ్రీన్ 5 శాతం తగ్గింపు, వైట్ - శాతం రాయితీని స్టోర్ లోపల చేసే కొనుగోళ్లపై లక్కీ డ్రా విజేతలకు లభిస్తాయి. ఈ లక్కీ డ్రా బ్యాండ్స్‌ను రెండు దశలలో స్టోర్‌లో రిడీమ్ చేసుకోవచ్చు. మొదటి దశలో డిసెంబర్ 23 నుంచి డిసెంబర్ 25, రెండవ దశ డిసెంబర్ 31 నుంచి జనవరి 1, 2023 వరకూ ఉంటాయి.

నిరుపేదలకు భూములిచ్చే బాధ్యత ప్రభుత్వానిదే

విశాలాంధ్ర - కిర్లంపూడి : అర్హులైన ప్రతి దళితుడికి భూములు ఇచ్చే బాధ్యత ప్రభుత్వానిదే నని, ఆ హక్కు ప్రపంచం గర్వించదగ్గ మహెూన్నత వ్యక్తి, భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ మనకు కల్పించిన హక్కు అని దళిత ఐక్య సమాఖ్య జాతీయ అధ్యక్షుడు దొమ్మేటి రాజా సతీష్ అన్నారు. కాకినాడ జిల్లా జగ్గంపేట నియోజక వర్గం కిర్లంపూడి మండలం గెద్దనాపల్లి గ్రామంలో పేదలు...రాజ్యాంగ హక్కులు...వాటి సంరక్షణపై అంబేద్కర్ ఫీల్డ్ లేబర్ సొసైటీ మాకాం వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. దళిత ఐక్య సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు, హైకోర్టు సీనియర్ న్యాయవాది దొమ్మేటి సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు రాజా సతీష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యా బాబు అంటే మనకు భూములు ఎవరూ ఇవ్వరని రాజ్యాంగం ద్వారా మనకు కల్పించిన హక్కుతో భూమికోసం భుక్తి కోసం దేశ విముక్తి కోసం పోరాడవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు ప్రొఫెసర్ శివకోటి నాగేశ్వరరావు, దళిత ఐక్య సమాఖ్య జాతీయ ఉప కారదర్శి, సీనియర్ న్యాయవాది డాక్టర్ తొర్లపాటి సీతల్, ప్రొఫెసర్ బోయిడి సూరిబాబు, సీనియర్ న్యాయవాదులు మురా రాజబాబు, పిల్లి బలరాముడు, సమాఖ్య జాతీయ మహిళా అధ్యక్షురాలు దొమ్మేటి హానీసుప్రీతి, సమాఖ్య ముఖ్య కో ఆర్డినేటర్, ప్రముఖ న్యాయవాది బి రవికుమార్ పలువురు పాల్గొని రాజ్యాంగ హక్కులపై అవగాహన కల్పించడమే కాకుండా తమ విలువైన సందేశాన్ని అందించారు.

మహెూన్నత వ్యక్తి రామానుజన్

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : గణిత శాస్త్రంలో అనేక అద్భుతమైన సిద్ధాంతాలను సృష్టించిన మహెూన్నత వ్యక్తి శ్రీనివాస రామానుజన్ అని ఉపాధ్యాయులు రాయపూడి వెంకట రమణ పేర్కొన్నారు. కొయ్యల గూడెం మండలం కుంతల గూడెం గ్రామంలో ఫ్రీ హైస్కూల్ వద్ద గణిత దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయురాలు కె.కనకమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కనకమ్మ మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ గణితానికి చేసిన సేవలను బాలబాలికలు ఆదర్శంగా తీసుకోవాలని గణిత మెళకువలను తెలుసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎం. విజయ్, కె. అమృత, బాల బాలికలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎమ్మెల్యే ప్రతాప్ ఉచిత ట్యాబ్‌ల పంపిణీ

విశాలాంధ్ర - ఆగిరిపల్లి : ఆగిరిపల్లి జిల్లా పరిషత్ హైస్కూలులో నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప అప్పారావు 8 వ తరగతి విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్ ల పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ప్రతాప్ మాట్లాడుతూ ట్యాబ్‌ల ఉపయోగం గురించి వివరించారు. గత ప్రభుత్వం లో బడుగు బలహీన వర్గాల పేద విద్యార్థులు కోసం ఏ ముఖ్యమంత్రి ఆలోచన చేయలేదు, కానీ జగన్ ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం అమ్మ ఒడి, మధ్యాహ్నం భోజనం పథకం గోరుముద్ద, నాడు నేడు కార్యక్రమంలో స్కూళ్లన్నీ రిపేరు చేయించి వాటికి పెయింట్లు వేయటం, టాయిలెట్ కట్టించడం జరిగిందన్నారు. ఆగిరిపల్లి మండల లో పాఠశాలలన్నింటికీ 450 ట్యాబ్ వచ్చాయని అని విద్యార్థులకు జగన్ మామయ్య ప్రభుత్వంలో మీరు అందరూ బాగా చదువుకుని విద్యార్థులు మంచి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గోళ్ళ అనుష, జెడ్పీటీసీ పిన్ని బోయిన వీరబాబు, ఆగిరిపల్లి మండల ఇంచార్జ్ మచ్చ హరిబాబు, అత్తి మురళి, ఆగిరిపల్లి ప్రధాన ఉపాధ్యాయిని పి పుష్పలత ఎంఈఓ రత్న కుమార్,డి వై ఈ ఓ ఎం. సేవియా, విద్యా కమిటీ చైర్మన్ పల్లగని రాంబాబు, చిమట శ్రీనివాసరావు, సుభాని, బుల్లెట్ బాబు సర్పంచులు, ఎంపీటీసీలు, బ్యాంకు ప్రెసిడెంట్లు,నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పేదవాడి గుండె చప్పుడు వంగవీటి రంగ

విశాలాంధ్ర-టి నరసాపురం: ప్రతి పేదవాడి గుండెచప్పుడు వంగవీటి మోహనరంగ అని ఆయన తనయుడు వంగవీటి రాధాకృష్ణ అన్నారు. మండలంలోని మధ్యాహ్నపువారి గూడెం, రుద్రకోటరాజుగూడెం, గంగినీడు పాలెం, మక్కినవారిగూడెం, అప్పలరాజుగూడెం గ్రామాలలో దాత సాధనాల నరసింహారావు ఆర్థిక సహాయంతో నూతనంగా ఏర్పాటు చేసిన వంగవీటి రంగ విగ్రహాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాధాకృష్ణ మాట్లాడుతూ రంగ ప్రజల మనిషి అందరి వాడని తెలిపారు. శాసన సభ్యులు గా కొద్ది కాలం పనిచేసిన పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు. ఆయన చనిపోయి 35ఏళ్ళయినా ఆయనపై ప్రజల్లో ఉన్న అభిమానం గొప్పదన్నారు. మీ అభిమానమే నా బలమని విగ్రహాల ఏర్పాటు లో పార్టీలకు అతీతంగా నాయకులు సహకరించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ ఛైర్మన్ కరాటం రాంబాబు, మాజీ ఎఎంసి చైర్మన్ జట్టి గుర్నాధరావు, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ, పోల్నాటి బాబ్జి, శీలం వెంకటేశ్వరావు, ఎల్లిన వెంకటరత్నం, కాల్నీడి సుబ్బారావు, అడపా నాగరాజు, తోట లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే జగన్ లక్ష్యం



విశాలాంధ్ర - యు కొత్తపల్లి : సంక్షేమ పథకాలు అందించడమే జగన్ ముఖ్య ఉద్దేశమని పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. వాకతిప్ప గ్రామ సచివాలయం పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పిఠాపురం శాసన సభ్యులు పెండెం దొరబాబు ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గడపగడపకు తిరుగుతూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఈ మూడేళ్ల కాలంలో అందజేసిన సంక్షేమ పథకాల గురించి ఆరా తీశారు. ప్రతి తలుపూ తడుతు ప్రజలు చెప్పేది సావదానంగా వింటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అర్హత ఉండీ కూడా ఇప్పటికీ సంక్షేమ పథకాలు అందని వారి వివరాలను సేకరించి వెంటనే సంక్షేమ పథకాలు అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని గ్రామ సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ, కారే సుధ శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు రావు చిన్నారావు, సర్పంచి పాలాని దొరబాబు ఎంపీటీసీ దాకే నాగమహేశ్వరీ రాజకుమార్, జడ్పిటిసి గుబ్బల తులసి కుమార్, వైయస్సార్ పార్టీ మండల అధ్యక్షులు ఆనాల సుదర్శన్, బండి దావీదు, ఎంపీటీసీలు, సర్పంచులు, వైస్ సర్పంచులు, వార్డ్ మెంబర్లు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజా ప్రతినిధులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సిలిండర్ అంటుకుని మిడ్ డే మీల్ వర్కర్‌కు గాయాలు

విశాలాంధ్ర - కరప : కరప మండలం ఉప్పలంక ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజనం వర్కర్‌గా పనిచేస్తున్న సత్యవతి అనే మహిళ వంటచేస్తుండగా గ్యాస్ సిలిండర్ మంటలు రేగడంతో స్వల్ప గాయాలయ్యాయని పాఠశాల ఉపాధ్యాయులు జె ఉషశ్రీ, ఎస్ శ్రీనివాస్ మంటలు అదుపు చేయడంతో ప్రాణాపాయం తప్పిందని తెలిపారు. ఆమెను వెంటనే కాకినాడ జనరల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించడం జరిగిందని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ విషయాన్ని మండల విద్యాశాఖ అధికారికి తెలపగా ఎంఈఓ బులి కృష్ణవేణి చికిత్స పొందుతున్న వర్కర్ వద్దకు వెళ్లి ప్రమాదం జరిగిన విషయాలను అడిగి తెలుసుకుని పై అధికారులకు నివేదిక సమర్పిస్తామని ఆమె తెలిపారని ఉపాధ్యాయుల తెలిపారు.